సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



కొల్లేరుకు వరద పోటు

కొల్లేరుకు వరద నీరు పోటెత్తుతోంది. భారీ వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద నీరు చేరడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 10లో



వైద్యులపై కలెక్టర్ ఆగ్రహం

ఆకివీడు మండలం దుంపగడపలో జ్వర బాధితుల నమూనాలు పరీక్షలకు పంపకపోవడంతో వైద్యులపై కలెక్టర్ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. 10లో

ఠాణాల్లో మూగబోయిన ఫోన్లు

పశ్చిమగోదావరి జిల్లాలో పోలీస్‌స్టేషన్లు మూగనోము పట్టాయి. కొన్ని నెలలుగా ల్యాండ్ లైన్ ఫోన్లు పనిచేయక బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 10లో



న్యూస్‌రీల్

సీపీఎస్‌ను రద్దు చేయాలి



జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం : సీపీఎస్, జీపీఎస్, యుపీఎస్ ఏమీ ఆమోదయోగ్యం కావని కేవలం ఓపీఎస్ విధానాన్ని మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయులు కోరుకుంటున్నాయని ఏపిటీఎఫ్–1938 పశ్చిమగోదావరి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి రమణ మీడియాకు తెలిపారు. రాష్ట్ర ఫెడరేషన్ పిలుపు మేరకు సీపీఎస్ అమల్లోకి వచ్చిన సెప్టెంబర్1ను బ్లాక్ డేగా పరిగణిస్తూ రాష్ట్రమంతటా అన్ని జిల్లాల్లో ఏపీటీఎఫ్–1938 ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని రమణ పేర్కొన్నారు. ఉద్యోగి కంట్రిబ్యుషన్ లేని పెన్షన్ విధానాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులు కోరుకుంటున్నారన్నారు. కేంద్రీకృత పెన్షన్ విధానాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులు తిరస్కరిస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ ఆకాంక్షలకు అనుగుణంగా సీపీఎస్ స్థానంలో ఉద్యోగి కంట్రిబ్యూషన్ లేని ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని మీడియా ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్–1938 ప.గో.జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుడు ఏఎస్‌వి సుభాషిణి, వేమూరి శ్రీవల్లి, ఎ.అన్నపూర్ణ, పి.నాగరాజు, పెద్దాడ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ధరలతో బతుకు దుర్భరం



ఉండి సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఉండి : రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసరాల వస్తువుల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారుతోందని తక్షణమే పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు తగ్గించాలంటూ సీపీఐ ఉండి ఏరియా సమితి ఆధ్వర్యంలో ఉండి సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సీపీఐఐఎస్ జాతీయ సమితి పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పి ఓట్లు వేయించుకున్న బీజేపీ ఇప్పుడు ధరలు ఆకాశాన్నంటుతుంటే చోద్యం చూస్తున్నారని అన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా పనిచేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడైనా ప్రజల పక్షంగా నిలిచి నిత్యావసర ధరల పెరుగుదలను అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తణుకు మున్సిపల్ కమిషనర్ బదిలీ

తణుకు: తణుకు మున్సిపల్ కమిషనర్ బీవీ రమణను బదిలీ చేస్తూ మున్సిపల్ పరిపాలన విభాగం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న టి.రామ్‌కుమార్‌ను తణుకు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

మీకోసం రద్దు

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా సోమవారం మీకోసం పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

3 నుంచి పొలం పిలుస్తోంది

పాలకొల్లు అర్బన్: ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు, సమగ్ర ఎరువుల యాజమాన్యం, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలసాయం అందించేలా పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. ఈ నెల 3 నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమంపై ఆదివారం తన కార్యాలయంలో వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పోడూరు మండలం పెనుమదం గ్రామంలో ముంపునకు గురైన వరిచేలను మంత్రి పరిశీలించారు.



పెదపాడు మండలం బొమ్ములూరులో నీటమునిగిన హైవే



వరదలో చిక్కుకున్న పెదపాడు మండలంలోని బొమ్ములూరు

ఉప్పొంగిన వాగులు.. వంకలు

జిల్లాలో స్తంభించిన జనజీవనం

- పెదపాడు మండలం అప్పనవీడులో నీట మునిగిన ఇళ్లు
- నూజివీడులో పెద్ద చెరువుకు గండితో శిబిరాల్లో బాధితులు
- ఉధృతంగా ఎద్దువాగు, పెదవాగు ప్రవాహం
- గరిష్ట స్థాయికి ప్రాజెక్టుల నీటిమట్టం
- వరద ముంపుతో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు
- వేలేరుపాడు మండలంలో 22 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



వేలేరుపాడు : మండలంలో లచ్చిగూడెం వద్ద దెబ్బతిన్న ఆర్ అండ్ బి రహదారి



పెదపాడు : మండలంలోని హైవేపై వరద నీటిలో నుంచి వెళ్తున్న లారీ



నూజివీడు : వరద ఉధృతికి దెబ్బతిన్న బైపాస్ రోడ్డు మార్జిన్



ముసునూరు : చెక్కపల్లి–చింతలవల్లి మధ్య రోడ్డుకు గండి



నూజివీడు : నూజివీడు బైపాస్ రోడ్డులో బోల్తా పడిన లారీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు : కుండపోత వానకు జిల్లాలో వాగులు, వంకలు ప్రమాదకర స్థాయిలో పొంగి పొర్లుతున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు గరిష్ట నీటి మట్టానికి చేరుకున్నాయి. జాతీయ రహదారి జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పెదపాడు మండలంలో అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నూజివీడు, పెదపాడు మండలాల్లోని లోతట్టు గ్రామాల్లో ఇళ్లల్లోకి నీరు చేరడంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు గోదావరి ఉధృతితో ఏజెన్సీలోని వేలేరుపాడు మండలంలో 22 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

అప్పనవీడులో ముంచెత్తిన వరద

పెదపాడు మండలంలోని అప్పనవీడు ప్రాంతంలో అనేక చోట్ల ఇళ్లల్లోకి నీరు చేరడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ప్రభావిత ప్రాంతంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ తదితరులు పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి హౌసింగ్ కాలనీని సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు. రామిలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో కలపర్రు టోల్ గేట్ వద్ద రాకపోకలు స్తంభించాయి. పెదపాడు మండలంలోని చిన సత్యవోలు, సత్యవోలు, సకలకొత్తపల్లి, కడింగుంట గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పర్యటించారు. పల్లెర్లమూడి నుంచి కొల్లేరు వరకు ప్రవహించే రామిలేరు కాలువను పరిశీలించి రామిలేరు వంతెన వద్ద గండి పడే ప్రమాదం ఉన్నందున అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏజెన్సీలో ప్రమాదకరంగా వాగులు

మరోవైపు ఏజెన్సీలో పెద వాగు, ఎద్దుల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు తమ్మిలేరు ప్రాజెక్టుకు చేరడంతో ప్రాజెక్టులో వరద పెరుగుతోంది. ప్రస్తుతం 348 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయంలో 3,463 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా, దిగువకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 81.88 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది.

పశ్చిమగోదావరిలో మునిగిన పంటలు

పశ్చిమగోదావరి జిల్లాలో కుండపోత వర్షానికి పంటలు ముంపునకు గురయ్యాయి. కాళ్ల మండలం లంక ప్రాంతంలో పంట పొలాలు మునిగాయి. సీసలి గ్రామ శివారు సత్యనారాయణపురం పంట కాలవ రోడ్డు ఏకమై నడవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. నర్సాపురం మండలంలోని మురుగు నీటి కాలువలు బిగపెట్టడంతో వర్షపునీరు చేలల్లోనే నిలిచి పోయింది. దీంతో సుమారు 1000 ఎకరాలు నీట మునిగి ఉండవచ్చని అంచనా. భీమవరంలో హౌసింగ్ బోర్డు కాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా రోడ్డు, గంగానమ్మ గుడి ప్రాంతం ముంపు బారిన పడ్డాయి. ఓల్డ్ యనమదుర్రు డ్రెయిను, మిరామియాకోడు, యనమదుర్రు డ్రెయిను ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి, లాకు పేట ప్రాంతాలు ముంపులోనే ఉన్నాయి.

ఎక్కడికక్కడ స్తంభించిన రాకపోకలు

ఏలూరు, పశ్చిమ గోదావరిలో కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై వరదనీరు ప్రవహించడం, విజయవాడ నీట మునగడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై ఏలూరు నుంచి గుండుగొలను వరకు వాహనాలు బారులుతీరాయి. చెక్కపల్లి – చింతలవల్లి గ్రామాల మధ్య సంధ్యపు వాగు వరద ఉధృతికి వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వేలేరుపాడు – రుద్రమ్మకోట రహదారి, గుళ్లవాయి – రుద్రమ్మకోట రహదారులు కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దెందులూరు మండలం సత్యనారాయణపురంలో గుండేరువాగు ఉధృతికి రాకపోకలు స్తంభించాయి. దెందులూరు–అలుగులగూడెం మధ్య రైల్వే అండర్‌పాస్‌లో నీరు చేరడంతో 14 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పెరుగుతున్న గోదావరి

భద్రాచలం వద్ద గోదావరి వరద పెరుగుతుండటంతో ముంపు మండలాల్లో వరద ప్రభావం మొదలైంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 31 అడుగుల మేరకు వరద నీరు చేరింది. దీంతో వేలేరుపాడు మండలంలో సుమారు 22 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కిన్నెరసాని వాగు పొంగడంతో సీతారామనగరంలో పంట చేలు నీట మునిగాయి. ప్రధాన రహదారి కోతకు గురైంది.

సహాయక చర్యల్లో సిబ్బంది

వరదల నేపథ్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ముమ్మరంగా సహాయక చర్యలు చేపడుతోంది.



వేలేరుపాడు : మండలంలో తెగిన ఎద్దులవాగు వంతెన



ఆకివీడు : కుప్పనపూడిలో నీటమునిగిన పొలాలు

నూజివీడు.. వరద గోడు

పునరావాస కేంద్రాల్లో బాధితులకు వసతి, భోజనం

నూజివీడు : పట్టణంలోని పెద్దచెరువుకు గండితో జలదిగ్బంధంలో చిక్కుకున్న 32వ వార్డు ఆదివారం ముంపు నుంచి బయటపడింది. వరద తగ్గిపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. గండ్లు వల్ల వరద నీరు బయటకు వెళ్లడంతో పెద్దచెరువు ఖాళీ అయింది. కనకదుర్గమ్మ ఆలయం పక్కన పడిన గండి నుంచి వరద ఉధృతికి దాదాపు 100 గృహాల్లోకి నీళ్లు చేరాయి. వీరిని శనివారం మధ్యాహ్నమే పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్, జడ్పీ బాలికల హైస్కూల్, అప్పారావుపేట స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. మొత్తం 169 మంది ఈ పునరావాస కేంద్రాల్లో ఉన్నారు. భోజన వసతితో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వరద ముంపు తగ్గడంతో ఆర్డీఓ వార్డులో పర్యటించారు. పూర్తిగా దెబ్బతిన్న, పాక్షికంగా దెబ్బతిన్న గృహాల జాబితా తయారు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. నూజివీడు–విస్సన్నపేట, హనుమాన్‌జంక్షన్–విస్సన్నపేటల మార్గంలో రాకపోకలు పునరుద్ధరించారు.

ఎస్పీ ఆధ్వర్యంలో సహాయక చర్యలు

ఎస్పీ కొమ్మి శివకిషోర్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వరదల్లో చిక్కుకున్న పలువురిని రక్షించాయి. కొప్పుల వెలమపేట, లారీ అసోసియేషన్ హాల్, పోతురెడ్డిపల్లిలలో వరదల్లో చిక్కుకున్న దాదాపు 50 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. వరద ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లకుండా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. గండి పడిన ప్రదేశాన్ని కలెక్టర్ వెట్రిసెల్వీ, డీఐజీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ధాత్రీరెడ్డి సందర్శించారు.

దెబ్బతిన్న బైపాస్ రోడ్డు

నీరు బైపాస్ రోడ్డు వైపుకు ప్రవహించడంతో పలుచోట్ల రోడ్డు మార్జిన్‌లు కోతకు గురయ్యాయి. మార్జిన్‌లోకి వెళ్లిన కోళ్ల మేత లారీ వరదలో బోల్తా పడింది. లారీ డ్రైవర్ పాపారావును స్థానికులు, పోలీసులు స్పందించి రక్షించారు.

గ్రామాలకు రాకపోకలు బంద్

పలు రోడ్లకు గండ్లు పడటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి నూజివీడు పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. నూజివీడు–పోతురెడ్డిపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఊటవాగు, నూజివీడు–కాట్రేనిపాడు మధ్య, నూజివీడు–జంగంగూడెం, దేవరగుంట గ్రామాల మధ్య ఉన్న రామిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల నుంచి నూజివీడుకు రాకపోకలు నిలిచిపోయాయి. ముసునూరు, కొర్లగుంట, గోగులంపాడు, చింతలవల్లి, గోపవరం తదితర గ్రామాల నుంచి కూడా నూజివీడుకు రాకపోకలు నిలిచాయి. పట్టణంలోని గొడుగువారిగూడెం సమీపంలోని చెరువు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారికి గండి పడటంతో నూజివీడు–రెడ్డిగూడెం మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో రెడ్డిగూడెంతో పాటు సిద్ధార్థనగర్, లైన్‌తండా, నర్సపేట, కొత్తూరు తండా, కుక్కలతండా, హతియాతండా తదితర గ్రామాల నుంచి నూజివీడుకు రాకపోకలు నిలిచిపోయాయి.



నూజివీడులోని హనుమాన్‌జంక్షన్ రోడ్డులో రహదారిపై నిలిచిన వరద నీరు



నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భారీ వర్షాలు, వరదల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వర్షం తగ్గి సాధారణ పరిస్థితిలు నెలకొనేవరకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. తణుకు మండలం దువ్వలో యానాదుల ప్రాంతానికి వర్షపు నీరు చేరుకున్న సమాచారంతో వారికి ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ, అగ్రికల్చర్ అధికారితో కలెక్టర్ అధిక వర్షాలపై సమీక్షించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు కారణంగా పంట నష్టపోకుండా తక్షణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు అందజేయాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ జె.ఉదయ భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం తనిఖీ చేస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

నేడు పాఠశాలలకు సెలవు

వర్షాల కారణంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, అంగన్‌వాడీ సెంటర్లకు సోమవారం సెలవు ప్రకటించామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో 670.2 మిల్లీమీటర్ల వర్షపాతం

భీమవరం: జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకూ 670.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆకివీడులో అత్యధికంగా 80 మి.మీ నమోదైంది. తాడేపల్లిగూడెంలో 24, పెంటపాడులో 28.2, తణుకులో 27, అత్తిలిలో 32.8, గణపవరంలో 49.2, ఉండిలో 46.6, పాలకోడేరులో 31.4, పెనుమంట్రలో 22.4, ఇరగవరంలో 48.2, పెనుగొండలో 19.2, ఆచంటలో 29.8, పోడూరు 24.6, వీరవాసరంలో 19.4, భీమవరంలో 21.4, కాళ్లలో 48, మొగల్తూరులో 10.4, నర్సాపురంలో 22.6, పాలకొల్లులో 45.8, యలమంచిలిలో 39.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

ఓపీఎస్ అమలు కోరుతూ ఏపీటీఎఫ్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

భీమవరం: ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పింఛన్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం డిమాండ్ చేశారు. భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ వద్దు – ఓపీఎస్ ముద్దు అంటూ నాయకులు నినదించారు. భీమవరం మండల అధ్యక్షుడు ఐ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.పీటర్, జిల్లా కార్యదర్శి జి.ప్రసన్న కుమార్, మండల ఉపాధ్యక్షుడు వై.విజయ్ కుమార్, కార్యదర్శులు టి.యేసేబు, ఏ.యేసేబు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల ప్రాంతంలో పలు దొంగతనాలకు పాల్పడిన ఓ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గూటాల గ్రామానికి చెందిన తాడి దుర్గారావు అనే వ్యక్తి నాలుగు చోరీ కేసుల్లో నిందితుడన్నారు. ఆదివారం తమకు అందిన సమాచారం మేరకు గూటాల సమీపంలో నిందితుడిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులకు సంబంధించి 360 గ్రాముల బంగారం, 452 గ్రాముల వెండి వస్తువులు దొంగిలించినట్లు ఫిర్యాదులు అందాయి. నిందితుడి నుంచి 48 గ్రాముల బంగారం , 252 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులను దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే తెలపండి

సాక్షి, విశాఖపట్నం: భారీ వర్షాలకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడగా యుద్ధప్రాతిపదికన సరిచేశామన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1912కు, కంట్రోల్ రూమ్ నంబర్లకు 2,583 ఫిర్యాదులు రాగా, వాటిని ఒక్క రోజులోనే 2,175 ఫిర్యాదులను పరిష్కారించగలిగామన్నారు. ఆయా సర్కిళ్లలో 365 మందితో 32 ప్రత్యేక బృందాలుగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. విద్యుత్ సమస్యలపై ఏలూరులో సెల్ 94409 02926 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: పోతవరంలో ఆటో ఢీకొని ఒక వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరానికి చెందిన జి.గంగరాజు (60) శనివారం సాయంత్రం పోతవరంలో రోడ్డుపక్క నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయలపాలైన వృద్ధుడిని స్థానికులు 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అనంతపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లేరుకు వరద పోటు

- తెలంగాణ నుంచి కొల్లేరుకు భారీగా చేరుతున్న వరద
- ముంపులో పెదఎడ్లగాడి – పెనుమాకలంక రహదారి
- పెదఎడ్లగాడి వంతెన వద్ద 12 అడుగుల నీటిమట్టం
- వంతెన వద్ద 25 ఖానాల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- బిక్కుబిక్కుమంటున్న కొల్లేరు లంక గ్రామాల ప్రజలు



పెద ఎడ్లగాడి వంతెన వద్ద భారీగా పేరుకున్న గుర్రపుడెక్క



మునిగిన పెద ఎడ్లగాడి – పెనుమాకలంక రోడ్డు



రోడ్డుపై నుంచి పారుతున్న వరద



పెద ఎడ్లగాడి వద్ద నీటి మట్టం

కైకలూరు: కొల్లేరుకు వరద నీరు పోటెత్తుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద నీరు కొల్లేరు వచ్చి చేరుతోంది. దీంతో వరద తీవ్రమై ఉగ్రరూపం దాల్చితే కొల్లేరు లంక గ్రామాలకు భారీ నష్టం తప్పదనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. కొల్లేరుకు చేరే వరద నీటిని సముద్రానికి మళ్లించే పెదఎడ్లగాడి వంతెన వద్ద ఆదివారం సాయంత్రానికి 12 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఇక్కడ మరో అడుగు పెరిగితే కొల్లేరులోని లోతట్టు గ్రామాలన్నీ ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే పెదఎడ్లగాడి – పెనుమాకలంక రోడ్డు నీట మునిగింది. దీంతో ఈ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి తోడు మొత్తం 52 ఖానాలలో 25 ఖానాలలో గుర్రపుడెక్క పేరుకుపోయి వరద నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది.

10 లక్షల క్యూసెక్కుల వరద నీరు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 12 మండలాల పరిధిలో 2,22,300 ఎకరాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. కొల్లేరు పరిధిలో మొత్తం 122 గ్రామాలున్నాయి. వరదల సమయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు కొల్లేరులోకి చేరుతోంది. ప్రధానంగా బుడమేరు, తమ్మిలేరు నుంచి నీరు ఎక్కువగా వస్తుంది. వివిధ డ్రెయిన్ల ద్వారా చేరుతున్న వరద నీరు మండవల్లి మండలం పెదఎడ్లగాడి, పోల్‌రాజ్ డ్రెయిన్లకు చేరుతోంది. అక్కడ నుంచి నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రానికి చేరాలి. గత పాలనలో పెదఎడ్లగాడి నుంచి ఉప్పుటేరు వరకు చానలైజేషన్ జరగకపోవడంతో లక్షా 10 వేల క్యూసెక్కుల నీటికి కేవలం 10 శాతం నీరే సముద్రంలోకి చేరుతోంది. మిగిలిన నీరు కొల్లేరు ప్రాంతాలను ముంచెత్తుతోంది.

బుడమేరు, తమ్మిలేరులతోనే ప్రమాదం

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రధానంగా బుడమేరు వరద ప్రవాహం ఉధృతంగా ఉంది. ఇక తెలంగాణ నుంచి తమ్మిలేరులోకి 10,282 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా కొల్లేరులో కలిసే చంద్రయ్య, నెప్రోలి డ్రెయిన్లు నుంచి ప్రమాదం పొంచి ఉంది. దీంతో కొల్లేరులోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. మండవల్లి మండలం మణుగునూరులంక, పులపర్రు, దొయ్యంపాడు, పెనుమాకలంక, కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, నత్తగుళ్లపాడు, పెంచికలమర్రు, వంటి గ్రామాలు నీటి మునిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆధునికీకరణ ఎప్పుడో?

కొల్లేరులోకి చేరే అదనపు నీటిని సముద్రంలోకి మళ్లించడానికి ఏర్పడే అడ్డంకులు తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను గతంలో రెండు కమిటీలు సిఫార్సు చేశాయి. 1987లో కొల్లేరు అనుబంధ ఏరుల అధునికీకరణకు రూ.40 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 1999లో జీవో నంబర్ 120లో కూడా కొల్లేరు నుంచి సముద్రంలోకి నీటిని తీసుకెళ్ళే ఉప్పుటేరులో ఆకివీడు వంతెన వద్ద నుంచి పేరంటాలు కనుమ, జువ్వ కనుమల వరకు పూడిక తొలగించాలని, రైల్వే బ్రిడ్జి కింద ఉప్పుటేరు లోతు పెంచాలని, బుడమేరు, తమ్మిలేరు, కట్టల ఎత్తు పెంచాలని నిర్ణయించారు. అయితే ఈ పనులేవీ ఆచరణకు నోచుకోకపోవడం గమనార్హం.

ప్రమాదం పొంచి ఉంది



ఎగువ నుంచి వస్తున్న వరద నీరు పెదఎడ్లగాడి వద్దకు భారీగా చేరుతోంది. ఇప్పటికే ఈ వంతెన వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదైంది. మరో అడుగు పెరిగితే లోతట్టు ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉంది. అయితే వంతెన ఖానాల్లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో యుద్ధప్రాతిపాదికన దీనిని తొలగించే చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో ఇక్కడ మరింతగా నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది.

– ఇందిర, డ్రెయినేజీశాఖ జేఈఈ, కైకలూరు

10న రాష్ట్ర స్థాయి రైతు సదస్సు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలోని యాదవ కల్యాణ మండపంలో ఈనెల 10న రాష్ట్ర స్థాయి రైతు సదస్సు నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు ఆదివారం తెలిపారు. వ్యవసాయ సంక్షోభం–మద్దతు ధరల అంశంపై ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నేత్రపర్వంగా శివయ్యకు రుద్రాభిషేకం



శివయ్యకు రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి అభిషేకాన్ని కన్నులపండువగా జరిపారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాత్రి స్వామివారికి జరగాల్సిన గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దయ్యింది.

వ్యాధి నిర్ధారణ చేయకుండా చికిత్స చేస్తారా

- దుంపగడపలో వైద్యులపై కలెక్టర్ నాగరాణి ఆగ్రహం
- గ్రామంలో వింతవ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశం



దుంపగడపలో వైరల్ ఫీవర్లతో మచ్చలు వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ఆకివీడు: దుంపగడప గ్రామంలో గత కొన్ని రోజులుగా ప్రజలు జ్వరంతో బాధపడుతూ ఇతర వ్యాధులకు గురవుతున్నప్పటికీ వారి నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ఎందుకు పంపలేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి పీహెచ్‌సీ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఆదివారం ఆమె పర్యటించారు. కలెక్టర్ వస్తున్నారని వైద్య సిబ్బంది మారమ్మ గుడి వద్ద అప్పటికప్పుడు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరం వద్ద గ్రామంలో పరిస్థితిని వైద్యులను, గ్రామస్తుల్ని అడిగి తెలుసుకున్నారు. టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యా, ఇతరత్రా జ్వరాలు వస్తున్నాయా అని ప్రశ్నించారు. ఏ వ్యాధికి వైద్యం చేస్తున్నారని నిలదీశారు. చికున్ గున్యా లక్షణాలుండటంతో ఆ దిశగా వైద్యం చేస్తున్నట్లు వైద్యులు రమేష్, రాజశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. వ్యాధి నిర్ధారణ కాకుండా వైద్యం ఎలా చేస్తారు, జబ్బు ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. జ్వరం తగ్గిన తరువాత ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు, ముఖం నల్లబడిపోతుందని, 15 రోజులైనా తగ్గడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వైరల్ ఫీవర్ వస్తే గతంలో వెంటనే తగ్గిపోయేదని, ఒళ్లు నొప్పులు కూడా వారం రోజుల్లో తగ్గిపోయేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, ఉపసర్పంచ్ నాగరాజు, గ్రామ పెద్దలు పిన్నమరాజు శ్రీనివాసరాజు, కొట్టు ఆంజనేయులు, మాణిక్యాలరావు కలెక్టర్‌కు వివరించారు. నా ముఖం నల్లబడిపోయిందని, చర్మం పొలుసులొస్తున్నాయని ఉపసర్పంచ్ నాగరాజు కలెక్టర్‌కు చూపించారు. జ్వరాలు తగ్గిపోతున్నాయని, ఇతర రకాలుగా జబ్బులు ఇబ్బంది పెడుతున్నాయని, అంతుచిక్కని వ్యాధులకు గురవుతున్నామని బాధితులు మొరపెట్టుకున్నారు. గ్రామంలో మంచినీటి చెరువులోకి కలుషిత నీరు చేరుతోందని తెలియజేశారు. శాంతినగర్ మురుగునీరు చొచ్చుకువెళ్లే ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. దీనిని వెంటనే నిలుపుదల చేయాలని అధికారులకు సూచించారు. ఆకివీడులో ఎస్‌సీ హాస్టల్‌ను కలెక్టర్ నాగరాణి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ ప్రాంగణంలో డ్రెయినేజీ నీరు నిల్వ ఉండటంతో కలెక్టర్ కమిషనర్ కృష్ణమోహన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటిలోగా మురుగును తొలగించకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. దుర్గంధంతో హాస్టల్ ప్రాంగణం ఉంటే పిలలకు ఏమైనా అయితే జైలు పాలవుతారని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ మండల అధికారులతో సమీక్షించారు. దుంపగడపలో వైరల్ ఫీవర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కందుల వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పార్వతి పాల్గొన్నారు.

వృద్ధురాలి ప్రాణాలు కాపాడిన స్థానికులు



చాపల సావిత్రి



కొయ్యలగూడెంలో లారీ కింద నుంచి వృద్ధురాలిని బయటకు తీసుకువచ్చిన దృశ్యం

కొయ్యలగూడెం: డివైడర్ దాటేందుకు ప్రయత్నించిన ఓ వృద్ధురాలిని యూటర్న్ తిప్పే క్రమంలో ఓ లారీ కింద పడిపోయిన ఓ వృద్ధురాలిని స్థానికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేసి కాపాడారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పొంగుటూరు పంచాయతీ కన్నాయిగూడెంకు చెందిన చాపల సావిత్రి అనే వృద్ధురాలు ఆదివారం ఉదయం కొయ్యలగూడెంలోని ఓ చర్చికి ప్రార్థనల నిమిత్తం వచ్చింది. ఈ క్రమంలో కొయ్యలగూడెంలో రోడ్డు డివైడర్ దాటుతుండగా, అదే సమయంలో కొరియర్ సర్వీస్ లారీ యూటర్న్ తిప్పుతుండగా, వృద్ధురాలు లారీ మధ్యభాగంలో చక్రాల మధ్యన పడిపోయింది. దీనిని గమనించిన అక్కడ ఉన్న ఓ దుకాణ యజమాని, స్థానికులు వెంటనే పరుగున వచ్చి కేకలు వేసి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో లారీని నిలిపివేయడంతో లారీ కింద ఉన్న వృద్ధురాలు ప్రాణాలతో క్షేమంగా బయటపడింది. వృద్ధురాలిని కాపాడిన షణ్ముఖి మొబైల్స్ షాపు యజమానిని, యువకులకు జీడీఎం చర్చి పాస్టర్ పీటర్ రాజ్, పలువురు పాస్టర్లు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి డ్రైవర్ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారులోని స్విమ్మింగ్ పూల్‌లో దిగిన ఓ డ్రైవర్ ఊపిరాడక మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వట్లూరుకు చెందిన అక్కినేని నగేష్ (32) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొందరు పిల్లలను వట్లూరులోని స్విమ్మింగ్ పూల్‌కు తన వాహనంలో తీసుకువెళ్లి తీసుకువస్తూ ఉంటాడు. ఆదివారం కూడా స్విమ్మింగ్ పూల్‌లో పిల్లలను తీసుకువెళ్లి దింపాడు. తరువాత అతను కూడా స్విమ్మింగ్ పూల్‌లోకి దిగి ప్రమాదవశాత్తు లోతుకు వెళ్లాడు. దీంతో ఈత రాకపోవడంతో ఊపిరి ఆడక మునిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అతనిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే నగేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు అవుట్‌పోస్టు పోలీసులు సమాచారం ఇచ్చారు.

అగ్గిపుల్లపై అబ్బురం



అగ్గిపుల్లపై రూపొందించిన వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలు

అగ్గిపుల్లపై మహానేత వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలను చెక్కి అబ్బురపరిచాడు ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్‌బాబు. మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా తనకు తెలిసిన సూక్ష్మకళతో ఈ చిత్రాలను చెక్కినట్లు సురేష్‌బాబు తెలిపారు.

– ఏలూరు (టూటౌన్)

భీమవరంలో వెల్డర్ హత్య




సైకం నాగరాజు మృతదేహం

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒక వెల్డర్ హత్యకు గురయ్యాడు. కాగా, ఇదే ఘటనలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం రోడ్డులోని రైల్వే అండర్ పాస్ సమీపంలో సైకం నాగరాజు (30), ఎ.తులసీ వరప్రసాద్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వెల్డింగ్ పనిచేసే నాగరాజును కత్తితో పొడవడంతో పేగులు బయటకు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. తులసీ వరప్రసాద్‌కు తలపై తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘర్షణలో ఎంత మంది పాల్గొన్నారు? ఘర్షణకు కారణం, తులసీ వరప్రసాద్‌ను గాయపర్చిందెవరనే వివరాలు తెలియాల్సి ఉందని సీఐ కాళీచరణ్ చెప్పారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రాణాల్లో మూగబోయిన ఫోన్లు

- కొన్ని నెలల నుంచి పనిచేయని ల్యాండ్‌లైన్ ఫోన్లు
- 2 నెలల నుంచి పూర్తిగా నిలిచిపోయిన సేవలు
- నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడమే కారణం
- జిల్లాలోని 25 లా అండ్ ఆర్డర్, 4 ట్రాఫిక్ స్టేషన్లు
- సమాచారం ఇవ్వాలంటే స్టేషన్‌కు పరిగెత్తాల్సిందే
- అత్యవసర సమయాల్లో రక్షణపై ప్రజల్లో సందేహాలు



భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో పోలీస్‌స్టేషన్లు మూగనోము బాట పట్టాయి. కొన్ని నెలలుగా స్టేషన్ల ల్యాండ్ లైన్ ఫోన్లు పనిచేయకపోవడంతో అత్యవసర సమయాల్లో పోలీసుల నుంచి వేగవంతంగా రక్షణ అందేనా అంటూ ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో బాధితులకు తక్షణం సహాయం అందించడానికి ఉపయోగపడాల్సిన పోలీస్ స్టేషన్లలోని టెలిఫోన్లు పనిచేయపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఎక్కడా దాడులు జరిగినా పోలీసులకు వెంటనే సమాచారం అందిస్తే ప్రభుత్వం ఆదుకుంటుందని హోం మంత్రి ప్రకటించిన నేపథ్యంలో స్టేషన్లలో పోలీసులకు సమాచారం ఎలా అందజేయాలంటూ బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారనో, ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారనే నెపంతో ఆ పార్టీ సానుభూతిపరులపై, నాయకులు, కార్యకర్తలు దాడులు చేస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. అంతేగాకుండా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను సైతం కూల్చివేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి తరుణంలో ప్రజలకు పోలీసుల రక్షణ ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులకు సమాచారం అందించేందుకు స్టేషన్లలో టెన్‌ఫోన్లు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే స్టేషన్లలో ప్రస్తుతం టెలీఫోన్ సేవలు నిలిచిపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెలల తరబడి మంజూరు కాని బిల్లులు

జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎస్పీ కార్యాలయంతో పాటు మూడు డీఎస్పీ కార్యాలయాలు, 25 లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు పట్టణాల్లో ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, దాడులు, రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆయా పరిధిలోని పోలీసుస్టేషన్ల ఫోన్ నంబర్లు మాత్రమే. అయితే జిల్లాలోని దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లలో టెలీఫోన్స్ బిల్లులు చెల్లించని కారణంగా సేవలు నిలిచిపోయాయి. సాధారణంగా పోలీసుస్టేషన్లకు టెలిఫోన్ బిల్లులకు సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి పోలీసుశాఖకు అందుతాయి. ఈ నిధులు మంజూరు కావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులే ముందుగా టెలిఫోన్ బిల్లులను చెల్లించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే తీసుకునేవారు. అయితే కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పోలీసు అధికారులు కూడా సొమ్ములు చెల్లించలేక చేతులెత్తేశారు. దీని వల్ల జిల్లాలోని దాదాపు అన్ని పోలీస్‌స్టేషన్లలో ల్యాండ్‌లైన్ ఫోన్లకు సేవలు నిలిచిపోయాయి. దీంతో ఏదైనా సమాచారం అందించాలంటే పోలీస్‌స్టేషన్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. ప్రభుత్వం తీరుతో ప్రజలకు పోలీసు సేవలు మరింత దూరమవుతాయని, తమకు తక్షణం రక్షణ కల్పించేది ఎవరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోలీస్‌స్టేషన్లలోని టెలిఫోన్ ల్యాండ్‌లైన్ బిల్లులను సక్రమంగా చెల్లించి వినియోగంలోనికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి

తణుకు అర్బన్: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహాలకు మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పూలమాలలువేసి నివాళులర్పిస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. ఉదయం 9 గంటలకు రాష్ట్రపతి రోడ్డులోని స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూలు ప్రాంతంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించి, అనంతరం వంగవీటి మోహనరంగా వీధిలోని వైఎస్సార్ పార్కులో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

పాత పింఛను విధానాన్నే పునరుద్ధరించాలి


తణుకులో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛను విధానాన్నే అమలుచేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తణుకులో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ డి.అశోక్‌వర్మకు వినతిపత్రం అందచేశారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లు తమకు వద్దని పాత పింఛను పద్ధతినే పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్, నాయకులు ఎ.వీరభద్రదరావు, వి.రామ్మోహన్, కె.రాంబాబు, సీహెచ్ సత్యనారాయణ, పీవీ పెద్దిరాజు, ఎ.ఏడుకొండలు, పాల్గొన్నారు.

ఇఫ్టూ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి


జగన్నాథపురంలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఇఫ్టూ రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 21, 22వ తేదీల్లో తాడేపల్లిగూడెం పట్టణంలో జరగనున్నాయని, ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో జన సమీకరణలో భాగంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, కర్తవ్యాలపై రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, చారిత్రక భౌతికవాదంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.పోలారి ప్రసంగిస్తారన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎస్.సత్తిబాబు, ఎం.సత్తిపండు, దుర్గారావు, యర్రంశెట్టి గణేష్, నాగవెంకట సత్యనారాయణ, సతీష్, రాంబాబు, కృష్ణ, నాగబాబు, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ వార్షికోత్సవం


ఎమ్మెల్యే ఆరిమిల్లిని సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు శ్రీ భారత మాత ఆటో యూనియన్ 25వ వార్షికోత్సవాన్ని పైడిపర్రులోని కాపు కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆటో యూనియన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. యూనియన్ తరపున పేదలకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ మాజీ కోర్డినేటర్ చీర్ల రాధయ్య యూనియన్ సభ్యులను అభినందించారు. యూనియన్ అధ్యక్షుడు పంగం రాంబాబు, కార్యదర్శి కంచుమర్తి విశ్వేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బసవ రామకృష్ణ, జిల్లా ఆటోయూనియన్ అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ, టీడీపీ నేతలు కలగర వెంకట కృష్ణ,కొమ్మిరెడ్డి శ్రీనివాస్, సీఐ ఎస్ కొండయ్య, న్యాయవాదులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆటో యూనియన్ నాయకులు సత్కరించారు.

మట్టి ప్రతిమలనే వాడదాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు పర్యావరణ అనుకూల వినాయక చవితి నిర్వహిద్దామని వీధి నాటిక కళా జాత బృందం సభ్యులు వి.సత్యకృష్ణ తెలిపారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఏలూరు వారి ఉత్తర్వులు మేరకు ఆదివారం పట్టణంలో పాటల రూపంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శబ్ద, వాయు, జల కాలుష్యం లేకుండా చవితి పండుగ జరపాలన్నారు. మట్టి వినాయకులను వాడటం మంచిదని వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల జల కాలుష్యం, శబ్దాలు వల్ల వినికిడి సమస్యలు వస్తాయని, ఇతర అనర్ధాలు కలుగుతాయని అవగాహన కల్పించారు.

వైఎస్సార్ చలవతో పేదలకు సొంతగూడు

- 2007లో అజ్జరంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- సుమారు 650 మందికి జీ ప్లస్ వన్ పద్ధతిలో ఇళ్లు అందజేత
- నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి


తణుకు అజ్జరంపుంతలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ కాలనీ

తణుకు టౌన్ : పేదల సొంతింటి కల నెరవేర్చి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తణుకు పట్టణంలో కనీసం గజం స్థలం కూడా కొనలేని పేదలకు దివంగత వైఎస్సార్ అన్ని వసతులతో కూడిన నివాసాలు కల్పించి పేదల సొంతింటి కల నెరవేర్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన పరిపాలనా కాలంలో ఇందిరమ్మ పథకం ద్వారా ఎందరో పేదలకు ఇళ్ల నిర్మాణం చేయించి అందించారు. పట్టణంలోని అద్దె ఇంటిలో, రోడ్డు పక్క మార్జిన్‌లలో గుడిసెలు వేసుకుని జీవించే పేదలకు సొంతి ఇళ్ల నిర్మించేందుకు ఇందిరమ్మ పథకం ద్వారా 2007వ సంవత్సరంలో పట్టణానికి దూరంగా అజ్జరం పుంతలో ప్రశాంత వాతావరణంలో సుమారు 10 ఎకరాల భూమిని సేకరించి అందులో సుమారు 650 మందికి జీ ప్లస్ వన్ పద్ధతిలో ఇళ్లు నిర్మించారు. ఈపథకంలో రంగస్థలంపై ఒక వెలుగు వెలిగిన వృద్ధ కళాకారులు సుమారు 18 కుటుంబాలకు కూడా ఈకాలనీలో పక్కా ఇళ్లు నిర్మించారు. అంతేకాకుండా సంచారం జీవనం సాగించి, తణుకు సంత మార్కెట్ షెడ్లలో నివాసం ఉండే వారికి ఇందిరమ్మ కాలనీ పక్కనే సుమారు 150 మందికి, యాచకులకు పక్కా ఇళ్లు నిర్మించారు. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటికి నోచుకోని ఎన్నో కుటుంబాలు నేడు ప్రశాంత వాతావరణంలో సొంతింటిలో నివాసం ఉంటున్నారంటే అది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలవేనని కాలనీవాసులు పేర్కొంటున్నారు. సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆ మహానేత తమకు చేసిన మేలును కాలనీవాసులు నెమరువేసుకుంటున్నారు.

వైఎస్సార్ స్మారక స్థూపం

తణుకు మండలం పైడిపర్రు పంచాయతీ 2005లో ఏర్పాటు చేసిన పార్కును ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మరణానంతరం జిల్లాలోనే తొలిసారిగా ఇక్కడ వైఎస్సార్ స్మారక స్థూపాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ఓదార్పు యాత్రలో భాగంగా ప్రారంభించారు.


పైడిపర్రులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ స్మారక స్తూపం

సొంతింటి కల నెరవేరింది



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకం ద్వారానే తణుకు పట్టణంలో మాకు సొంతిల్లు ఏర్పడింది. పట్టణంలో కూలీ చేసుకుని అద్దె ఇంట్లో నివసిస్తూ ఎన్నో ఇబ్బందులు పడ్డ మాకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ద్వారానే సొంతింటి కల నెరవేరింది.

– సన్నిధి ముత్యాలరావు, తణుకు అజ్జరంపుంత కాలనీ నివాసి

అద్దె బాధలు తప్పాయి



తణుకు వంటి పట్టణాల్లో పేదలకు సొంతిల్లు ఊహించలేం. అలాంటి పరిస్థితుల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు అద్దె బాధలు తప్పాయి. దీనికి వైఎస్ ప్రవేశపెట్టిన పథకాలే కారణం.

– బి.సాక్షి వేణుగోపాలరావు, అజ్జరం పుంత ఇందిరమ్మ కాలనీ వాసి

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు


చిల్డ్రన్స్ హోంలో సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్స్ హోంకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో పలు సేవలు అందజేశారు. చిన్నారులకు దుప్పట్లు, స్టీల్‌క్యారేజీలు, బియ్యం బస్తాలు, పౌష్టికాహారం, బిర్యానీ, డ్రింక్స్ అందించారు. జిల్లా జీఎంఏ నూతన క్లబ్స్ కో ఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఆకుల నాగ వెంకట సుబ్రహ్మణ్యం, కర్రి సురేష్ కుమార్, చెన్నారెడ్డి, కుందుం వెంకటేశ్వరరావు, ఆకుల సతీష్, అడ్డాల ప్రసాద్, వీరభద్రరాజు, డేనియల్ మేఖలే పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

తణుకు అర్బన్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల రక్షణ దృష్ట్యా సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నిటికి కాంపిన్సేటరీ సెలవు దినము జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రకటించినట్లు తణుకు మండల విద్యాశాఖాధికారి హైమావతి తెలిపారు. కావున అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు విధిగా పాఠశాలలను మూసివేయాలని, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖాధికారి చర్యలు తీసుకుంటారని వివరించారు.

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

తణుకు టౌన్: తణుకు స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. తణుకులోని మెడికల్ అసోసియేషన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాదవ్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొని సంఘ విధి, విధానాల గురించి సభ్యులకు వివరించారు. సంఘం నూతన అధ్యక్షుడు నాగుమల్లి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కోరిమిల్లి సుబ్బారావు, కోశాధికారి గురజాపు శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లగొండ వెంకట రామకృష్ణ, మందారపు శ్యామ్‌సుందర్, లక్కోజు రాజగోపాలాచారి, కడియం సూరిబాబు, కీర్తి శివప్రసాద్, పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక..

తణుకు పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా మందారపు నాగ మనోహార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం తణుకులోని మెడికల్ అసోసియేషన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు నక్కా శ్రీనివాస్, బత్తుల శివకేశవ, లక్కోజు సత్తిబాబు, ముంగన్న శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన


అత్తిలిలో శ్రీకృష్ణాలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా అత్తిలి అజయ్‌నగర్‌లో గల శ్రీకృష్ణాలయం వద్ద అఖండ అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. యాదవ సంఘ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును పునఃసమీక్షించాలి


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మంగరాజు, నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జనగణన, కులగణన చేయకుండా ఎస్సీ వర్గీకరణ చేస్తే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం మాలమహానాడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగరాజు మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చునని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిన వెంటనే, దేశవ్యాప్తంగా ఉద్యమించామని తెలిపారు. సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను 341 అధికరణ ప్రకారం రాజ్యాంగ సవరణ జరగకుండా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు విడదీయం, కలపడం హక్కు ఎవరికి లేదన్నారు. పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు శాతం ఇరవైరెండుకు పెంచాలన్నారు. నాయకులు షోడదాసి జైపాల్, మానుకొండ నాగేశ్వరరావు, తాడేపల్లి ప్రేమ్‌కుమార్, సునీల్‌బాబు, సునీల్ కుమార్, మధు, గాంధీ, యేసు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ పట్ల జాగ్రత్తలు పాటించాలి


అత్తిలిలో నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కె నాగరాజు

అత్తిలి: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంక్షరణ పట్ల జాగ్రత్తలు పాటించాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు అన్నారు. ఆదివారం అత్తిలి పెమ్మరాజు వీధిలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన ప్రజల్లో ఇద్దరికి సాధారణ వైరల్ ఫీవర్స్ నమోదయ్యాయి. ఈ సందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ జ్వరం, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు వెంటనే ఆరోగ్యకేంద్రానికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. అత్తిలి పెదపేటలో ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని వైద్యాధికారి నాగరాజు, సబ్‌యూనిట్ అధికారి జి వెంకటేశ్వరరావు సందర్శించారు. హాస్టల్ పరిసరాలు, గదులు, వంటగదులు, తాగునీటిని పరిశీలించారు. హాస్టల్ ప్రాంగణంలో నీటినిల్వలు లేకుండా పొడిగా ఉండేటట్లు చూడాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్ ఝాన్సీదుర్గాలక్ష్మీకు సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి మురళి, ఆరోగ్యకార్యదర్శులు ఎ పద్మావతి, జి లక్ష్మీబాయ్, హెల్త్ అసిస్టెంట్ జె గనిరాజు, టి నాగేశ్వరరావు, కె రఘురాం, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉమా చంద్రశేఖరునికి పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో మాస శివరాత్రి పురస్కరించుకుని ఉమా చంద్రశేఖర స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపారు. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, నాయకులు పేరూరి కాశయ్య, ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

తాడేపల్లిగూడెం (టీఓసీ): వర్షాల కారణంగా పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాలను ఆదివారం ఆర్డీఓ బీఎస్ఎస్ రెడ్డి పరిశీలించారు. ముంపు నివారణ చర్యలు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీరు సాఫీగా ముందుకు వెళ్లే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు ఆర్డీఓ వెంట ఉన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

తణుకు టౌన్: భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించాలని వేల్పూరు భవన నిర్మాణ సంఘం గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీరభద్రరావు కోరారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని పార్వతిదేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఢిల్లీ, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని కోరారు. సంఘ అధ్యక్షుడు వాటాల నాగేశ్వరరావు అధ్యక్షత ఈ సమావేశం జరిగింది.

ఎల్ఐసీని బలోపేతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ రంగంలో వెలుగొందుతున్న ఎల్ఐసీని బలోపేతం చేయాలని బ్యాంక్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, బ్యాంక్ ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్ బి.ఏడుకొండలు, ఎల్.గాంధీ పేర్కొన్నారు. ఎల్ఐసీ 68వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో అనేక జాతీయ, అంతర్జాతీయ బీమా సంస్థల నుంచి విపరీతమైన పోటీ ఎదుర్కొంటూ, ప్రభుత్వ వివక్షలకు గురవుతున్నా, ఎల్ఐసీ నిత్యలాభాలతో పురోగమించడం, జాతి అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తున్నప్పటికి ఎల్ఐసీ పటిష్టంగానే ఉందన్నారు. దేశానికి, ప్రజలకు ఎన్నో సేవలను అందిస్తున్న ఎల్ఐసీని పటిష్టం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

5న ఉచిత మెగా వైద్యశిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సిపాయిపేటలో ప్రాంతీయ తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ (భవన నిర్మాణ సంఘం) కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన ఉదయం 9 నుంచి నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు దువ్వ శ్రీనివాస్ తెలిపారు. మానవత సంస్థ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాల నుంచి వచ్చే వైద్యులచే బీపీ, సుగర్, ఎలర్జీలు, దగ్గు ఆయాసం, ఉబ్బసం, గుండె జబ్బులు, స్త్రీల వ్యాధుల, ఎముకల వ్యాధులు, కడుపులో నెప్పులు, గ్యాస్టిక్ నెప్పులు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులతో పాటు విలువైన ఈసీజీ, 2డీ ఎకో, గుండె పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు ఇవ్వడం చేస్తామన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

పాలకొల్లు అర్బన్: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో వాష్‌రూమ్‌లో కెమెరాలు అమర్చి వీడియోలు తీసిన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయసరిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సభ్య సమాజం సిగ్గుపడేలా కళాశాల విద్యార్థినుల వీడియోలు తీసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మహిళలకు రక్షణ కరువైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో దిశ యాప్‌ను పెట్టి ఆడపిల్లలకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.

తుపాను ప్రభావిత గ్రామాల్లో వైద్య సేవలందించాలి

నరసాపురం రూరల్: తుపాను అధిక వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో అనారోగ్య పరిస్థితులు నెలకొనకుండా ఉండేలా సిబ్బంది సేవలందించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని తూర్పుతాళ్లు పీహెచ్‌సీని సందర్శించారు. జ్వర పీడితులు, మందులు, వ్యాక్సినేషన్ల స్టాకు తదితర వివరాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ వార్డును సందర్శించిన ఆయన ఆసుపత్రిలో బాలింతరాలు, సహాయకులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుపాను కారణంగా తీరప్రాంత గ్రామాలైన కేపీ పాలెం, పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్‌లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రసాద్, తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

4న ఉచిత కేన్సర్ వైద్య శిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

నరసాపురం: పట్టణంలోని అశ్విని ఆసుపత్రిలో ఈ నెల 4న ఉచిత రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంధి విజయలక్ష్మి, సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, గైనకాలజిస్ట్‌ల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మాదంశెట్టి పద్మావతి చెప్పారు. తమ ట్రస్ట్ ద్వారా గత 15 ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా కాన్సర్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందుగా గుర్తించి చికిత్సలు తీసుకుంటే ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరంలో 30 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. పరీక్షలు చేయించుకునేవారు ఈనెల 3 లోపు 08814–276667 నెంబర్‌కు ఫోన్ చేసి రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: రానున్న మూడ్రోజులు ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పొలాల్లో వర్షపు నీరు బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాగా, ఈనెల 3వ తేదీన కొత్తూరు, మాధవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 8 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, సంచార వైద్యశాల ద్వారా తణుకు, పైడిపర్రులోని వృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహాయంతో మందులను అందజేశారు.

పెరిగిన కూరగాయల ధరలు


తాడేపల్లిగూడెం సంతమార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూరగాయల ధరలు గత వారంతో పోలిస్తే పెరిగాయి. సంతమార్కెట్‌లో ఈ ధరలు స్వల్పంగానే పెరిగినా రిటైల్ మార్కెట్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సంతమార్కెట్‌లో గత వారం కూరల ధరలు కేజీ రూ.30లోపే పలుకగా ఈవారం అన్నీ రూ.40 దాటాయి. పట్టణంలోని బ్రహ్మనందరెడ్డి సంత మార్కెట్‌లో ఆదివారం రోజున కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. ఉల్లిపాయలు కేజీ రూ.50, వంకాయలు కేజీ రూ.40, మునగకాడలు రెండు రూ.10, బెండకాయలు కేజీ రూ.40, దొండకాయల కేజీ రూ.40, క్యారెట్ కేజీ రూ.40, బీట్‌రూట్ కేజీ రూ.40, టమాటాలు కేజీ రూ.30, అల్లం కేజీ రూ.50, పచ్చిమిర్చి పావుకేజీ రూ.15, మామిడికాయ ఒకటి రూ.10, కాకరకాయలు కేజీ రూ.50, అరటికాయలు మూడు రూ.20, కేబేజీ రూ.40, క్యాప్సికం రూ.40, చామదుంపలు రూ.40, వెల్లుల్లి పావు కేజీ రూ.80, చింతపండు కేజీ రూ.120, చిక్కుడుకాయలు కేజీ రూ.80, బంగాళ దుంపలు కేజీ రూ.40, బీరకాయలు కేజీ రూ.60 ఉన్నాయి. మిగిలిన కూరగాయాలు ధరలు సైతం అటు ఇటుగా కేజీ రూ.50 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. నిమ్మకాయల ధరలు పెద్ద సైజు ఒకటి రూ.3 నుంచి రూ.4కు అమ్ముతున్నారు. అవి గిరాకి పలుకుతున్నాయి. ఉల్లిధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్‌లో వ్యాపారస్తులు చెబుతున్నారు.